క్లుప్తంగా

దసరా క్యూలైన్ పనులకు నేడు పూజా కార్యక్రమాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై అక్టోబర్ 15వ తేదీ నుంచి 23వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాల ఏర్పాట్లు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఆదివారం ఉదయం 10–30 గంటలకు కెనాల్ రోడ్డులోని వినాయకుడి గుడి వద్ద నుంచి క్యూలైన్ పనులను ప్రారంభించనున్నారు. క్యూలైన్ పనులకు ఆలయ చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబలతో పాటు పాలక మండలి సభ్యులు, ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ సిబ్బంది హాజరవుతారు.

రామ కథాగానం మధురాతి మధురం



విజయవాడ కల్చరల్: రామకథాగానం మధురాతి మధురం అని విఖ్యాత హరికథా భాగవతార్ గుడిపాటి జయరాం సుధాకర్ అన్నారు. హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయదాసు 159 జయంతి ఆయన శిష్యప్రశిష్యులు ఐదురోజులపాటు నిర్వహించే హరికథా ఉత్సవాలు సత్యనారాయణపురంలోని సీతారామా కల్యాణ మండపంలో శనివారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు కార్యక్రమంలో సుధాకర్ ఆదిభట్లనారాయణదాసు రచించిన సంపూర్ణ రామాయణంలోని సీతాకల్యాణం ఘటాన్ని మధురంగా వినిపించారు. మూర్తీభవించిన ధర్మానికి ప్రతిరూపం అని రామజననం నుంచి సీతాకల్యాణం వరకు జరిగిన ఘటనలు వివరించారు. నేమాని నాగలక్ష్మి పార్వతీ కల్యాణం, యడవల్లి సుబ్రహ్మణ్యం భక్తప్రహ్లాద, ముదపాక బాలసుందరం నర్తనశాల, పి.వేదవతి శ్రీకృష్ణరాయబారం కథాగానం చేశారు. కార్యక్రమ కన్వీనర్ బుర్రా పద్మనాభశర్మ భాగవతులను సత్కరించారు.

గర్భిణుల సేవలపై ప్రత్యేక దృష్టి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కుటుంబ డాక్టర్ కార్యక్రమంలో గర్భిణులు, బాలింతల సేవలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని, వారికి అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. విజయవాడ రూరల్ మండలంలోని గూడవల్లి విలేజ్ హెల్త్ క్లినిక్‌లో నిర్వహిస్తున్న కుటుంబ డాక్టర్ కార్యక్రమాన్ని శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడకు వచ్చిన వారికి అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. రోగులకు ఇచ్చేందుకు మందులు అందుబాటులో ఉన్నాయా అనే అంశాన్ని పరిశీలించారు. అనంతరం ఆ ప్రాంతంలో నిర్వహిస్తున్న డ్రైడే ఫ్రైడే, వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం, అంగన్‌వాడీ సేవలు, ఆశ యాప్ లాగిన్ పర్యవేక్షణ వంటి అంశాలను తనిఖీ చేశారు. నగరంలోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో రూరల్ వైద్యాధికారులకు జగనన్న ఆరోగ్య సురక్ష శిక్షణ నిర్వహించారు. డీపీఎంఓ డాక్టర్ నవీన్, కుటుంబ డాక్టర్ నోడల్ అధికారి డాక్టర్ మోతీబాబు, డాక్టర్ వాసంతి పాల్గొన్నారు.

వోల్వో ఎలక్ట్రికల్ కారు విడుదల



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం నిడమానూరులోని కార్ల తయారీ సంస్థ వోల్వో కంపెనీకు చెందిన సి 40 ఎలక్ట్రిక్ కారు శనివారం రాత్రి నగర మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూమ్ జీఎం సురేష్ కుమార్ మాట్లాడుతూ అత్యాధునిక సౌకర్యాలతో సరికొత్త ఫ్యూచర్లతో వినియోగదారులకు తగ్గట్టుగా ఈ కారును రూపొందించినట్లు తెలిపారు. ఈ ఎలక్ట్రిక్ కారును ఒక్క సారి ఛార్జ్ చేస్తే 530 కిలో మీటర్ల మైలేజ్ ఇస్తుందని తెలిపారు. తక్కువ సమయంలో ఈ కారుకు దేశ వ్యాప్తంగా మంచి పేరు వచ్చిందన్నారు. అతి తక్కువ సమయంలోనే కారును ఛార్జ్ చేసుకోవచ్చని తెలిపారు. ఈఈసీ 40 ఈవీ కారు ధర సుమారు రూ.61లక్షల వరకు ఉంటుందని తెలిపారు. పర్యవరణాన్ని పర్యరక్షిస్తూ ఈ కారును వినియోగించడానికి ఇష్టపడే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో షోరూమ్ సిబ్బంది, వినియోగదారులు పాల్గొన్నారు.





వైభవంగా గుణదల శతాబ్ది ఉత్సవాలు





గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర శతాబ్ది ఉత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విజయవాడ కతోలిక పీఠం బిషప్ తెలగతోటి జోసెఫ్ రాజారావు, మోన్సిగ్నోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ గాబ్రియేలు, పుణ్యక్షేత్ర రెక్టార్ ఫాదర్ యేలేటి విలియం జయరాజు తదితర గురువులు ప్రధానాలయం వద్ద లూర్దుమాత శత జయంతి ఉత్సవాల జెండాను ఆవిష్కరించి వేడుకలు ప్రారంభించారు.

సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

టీడీపీ నాయకులకు ఓటమి భయం

గుణదల (విజయవాడ తూర్పు): ఎన్నికలు దగ్గర పడుతున్న ప్రస్తుత తరుణంలో టీడీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని వైఎస్సార్ సీపీ నగర ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ అన్నారు. గుణదలలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజకీయ నీచుడిగా పేరు తెచ్చుకున్న టీడీపీ నాయకుడు పట్టాభికి మతి భ్రమించిందని ధ్వజమెత్తారు. నిత్యం ప్రజల్లో ఉంటూ సేవ చేస్తున్న వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్‌ను విమర్శించడం హేయమన్నారు. కాల్‌మనీ, సెక్స్ రాకెట్ కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్న పట్టాభి తమ నాయకుడు అవినాష్ ను విమర్శించడం హాస్యాస్పదమన్నారు. వచ్చే ఎన్నికల్లో అవినాష్ గెలవటం కల అంటూ పట్టాభి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా తప్పుబట్టారు. వయసులో చిన్నవాడైనా ప్రజా సమస్యలు తెలుసుకుంటూ నిత్యం ప్రజల్లో ఉంటున్న అవినాష్ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో గెలవటం ఖాయమని స్పష్టం చేశారు. కో ఆప్షన్ సభ్యుడు ముసునూరి సుబ్బారావు మాట్లాడుతూ టీడీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. సమావేశంలో 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేద్కర్, మాజీ డెప్యూటీ మేయర్ ఆళ్ల చల్లారావు, తదితరులు పాల్గొన్నారు.

చట్ట ప్రకారమే చంద్రబాబు అరెస్టు

- తప్పుచేస్తే చట్టం పరిధిలో ఎవరైనా ఒకటే
- 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా చేస్తే.. అవినీతికి పాల్పడినా అరెస్ట్ చేయరా?
- అరెస్ట్‌ను పట్టించుకోని ప్రజలు, సామాన్య కార్యకర్తలు
- అన్ని ఆధారాలతోనే అరెస్ట్ చేశారని నిపుణుల వెల్లడి
- దీనిలో రాజకీయ కక్ష సాధింపు ఏముందీ అంటున్న సామాన్యులు
- పలువురు అభిప్రాయాలతో ప్రత్యేక కథనం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులకు నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమంలో అవినీతి, అక్రమాలకు పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్ట్ చేయడం సబబేనని ప్రజలు భావిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అవినీతికి పాల్పడితే అరెస్ట్ చేయరా అని సామాన్యులు సైతం ప్రశ్నిస్తున్నారు. దీంతో చంద్రబాబును నంద్యాలలో ఉదయం అరెస్ట్ చేసినా, సాయంత్రం వరకూ విజయవాడలో ప్రశాంత వాతావరణం నెలకొంది. ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. వ్యాపారాలు ఎప్పటిలాగానే కొనసాగాయి. షోరూమ్‌లు వినియోగదారులతో కిటకిటలాడాయి. బస్సులు యథాతథంగా తిరిగాయి. స్కిల్ డెవలప్‌మెంట్‌లో అవినీతి జరిగిందని సీఐడీ అధికారులు ఆధారాలతో సహా చెబుతుంటే, అరెస్ట్ చేయరా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. అవినీతి కేసులో అరెస్ట్ చేస్తే రాజకీయ కక్ష సాధింపు అనడం సరైంది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటి వరకూ అనేక కేసుల్లో స్టేలపై తప్పుకున్న చంద్రబాబు పాపం పండిందని, అందుకే అరెస్ట్ అయ్యాడని ప్రజలు అంటున్నారు.

ఆ పార్టీలోనే స్పందన లేదు



స్కిల్ స్కాంలో చంద్రబాబు సాక్ష్యాధారాలతో సహా దొరికిపోయారు. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. చంద్రబాబును అరెస్ట్ చేశారు. తమ అధినేతను అరెస్ట్ చేసినా టీడీపీ శ్రేణుల్లో ఏ మాత్రం స్పందన లేదు. వాస్తవానికి టీడీపీ నేతలకే చంద్రబాబుపై నమ్మకం లేదు. స్కాంలు చేశారు.. అరెస్ట్ అయ్యారు. మేమెందుకు రోడ్లపైకి రావాలి అన్న తీరుగా వ్యవహరించారు. టీడీపీ శ్రేణులకు వాస్తవాలు తెలియడంతో స్పందించలేదు.

దేవిరెడ్డి ఆంజనేయరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్ సీపీ

తప్పు చేస్తే శిక్ష తప్పదు



నిరుద్యోగుల సొమ్మును చంద్రబాబు కాజేశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అడ్డంగా దొరికిపోయారు. ఇన్నాళ్లు అధికారాన్ని అడ్డుపెట్టుకుని వ్యవస్థలను మేనేజ్ చేస్తూ తప్పించుకుంటున్నారు. తప్పు చేసిన వారికి ఎప్పటికైనా శిక్ష తప్పదు. ఇపుడు సమయం వచ్చింది. సాక్ష్యాధారాలతో చంద్రబాబును సీఐడీ అరెస్ట్ చేసింది. స్కాంలలో చంద్రబాబు పాత్ర సుస్పష్టం కావడంతో ఆ పార్టీ నేతలే స్పందించడం లేదు. పార్టీ నాయకులు స్పందించకపోవడంతో స్కాంలో చంద్రబాబు పాత్ర ఉందని ప్రజలు నమ్ముతున్నారు.

అవుతు శ్రీశైలజా రెడ్డి, డెప్యూటీ మేయర్

రాజకీయ కుట్రలు లేవు



స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం దేశంలోనే అతి పెద్దది. ఈ స్కాంలో సాక్ష్యాధారాలు ఉండబట్టే చంద్రబాబును సీఐడీ అరెస్ట్ చేసింది. చంద్రబాబు అరెస్ట్ అంతా చట్ట ప్రకారమే జరిగింది. ఇందులో రాజకీయ కుట్రలు లేవు. అందుకే టీడీపీ నాయకులు ఏ ఒక్కరూ బయటకు రాలేదు. చంద్రబాబుకు తెలిసే ఈ స్కాంలో పాత్రధారులు ఇద్దరిని విదేశాలకు పంపించి వేశారు. ఈ అరెస్టుల విషయంలో రాజకీయ కుట్రలు లేవు. గత రెండు రోజులుగా చంద్రబాబే రేపో మాపో తనను అరెస్టు చేస్తారని చెబుతూ వచ్చారు. అయినా టీడీపీ నాయకులు ముందుకు రాలేదు. ఈ స్కాంలో చంద్రబాబు పాత్ర ఉందని టీడీపీ నాయకులకు తెలుసు. అందుకే ఆ పార్టీ నాయకులు ఎవ్వరూ స్పందించలేదు. చంద్రబాబు పాత్ర ఉండడంతో కోట్ల రూపాయలు ఖర్చు చేసి ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో లాయర్లను పిలిపించుకున్నారు.

ఆకుల శ్రీనివాస కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు

రైతు అంశంపై పీహెచ్‌డీ అభినందనీయం



ఎన్వీ రావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు తదితరులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): రైతు పండించిన పంట నేరుగా వినియోగదారులకు ఏ విధంగా చేరాలనే అంశంపై విద్యావేత్త ఎన్వీ రావు పీహెచ్‌డీ చేయడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. బీసీ ఇంటర్నేషనల్ అధ్యక్షులు ఎన్వీ రావుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందించడంతో లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్మైల్స్, రాకేష్ విద్యా సంస్థలు, అవంతి జూనియర్ కాలేజీల ఆధ్వర్యంలో శనివారం అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అధికార భాషా సంఘం చైర్మన్ పి.విజయ్‌బాబు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. వేముల హజరత్ గుప్తా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తొలుత ఎన్వీ రావు దంపతులను సత్కరించారు. ఎన్వీ రావు విద్యా సంస్థలను నడుపుతూ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులతో పాటు దుర్గగుడి మాజీ చైర్మన్ పైలా సోమినాయుడు, పోలీస్ అధికారి షేరింగ్ బేగం, లైన్స్ జిల్లా గవర్నర్ శంకర్‌గుప్తా, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసన శంకర్రావు, బీసీ సమైక్య అధ్యక్షులు అంగిరేకుల ఆదిశేషు, అడిషనల్ ఎస్పీ శోభ మంజరి, శేషగిరి, బుద్దా నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆవిష్కరణల వైపు దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న నాగభూషణరెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తాము ఎంచుకున్న కోర్సులకు సంబంధించిన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలని చంద్రయాన్‌కు విడిభాగాలను అందించిన నాగసాయి ప్రెసిషియన్ ఇంజినీర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత బి. నాగభూషణరెడ్డి అన్నారు. ఇస్రో పంపే ఉపగ్రహాలకు బ్యాటరీ విభాగానికి అవసరమైన విడిభాగాలను అందిస్తున్న హిందూ హైస్కూల్స్ కమిటీ విద్యాసంస్థల పూర్వ విద్యార్థి నాగభూషణరెడ్డితో పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ తమ విద్యార్థులతో రెండు రోజులుగా వివిధ విభాగాలతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణరెడ్డి మాట్లాడుతూ భారతదేశ సాంకేతిక పరిజ్ఞానం అపూర్వమన్నారు. ప్రపంచ దేశాలలో గర్వించదగ్గ స్థాయిలో ఇస్రో అద్భుతమైన పనితీరును కనబరుస్తుందన్నారు. ఇస్రో నుంచి అంతరిక్షంలోకి పంపించే చంద్రయాన్–3, ఆదిత్య ఎల్1 వంటి ఉపగ్రహాల్లో ఉపయోగించే లిథియం అయాన్ బ్యాటరీలకు రక్షణ కవచంలా ఉండే నాణ్యమైన పరికరాలను తయారుచేసి అందించే బాధ్యతను తమ సంస్థ నిర్వహిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జె.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నాగభూషణరెడ్డి వంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పతం జలిశాస్త్రి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎస్.మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



దర్శనం అనంతరం ఆలయం వెలుపలకు వస్తున్న భక్తులు



క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను దర్శించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు శనివారం ఇంద్రకీలాద్రికి భారీగా తరలివచ్చారు. వీకెండ్ కావడంతో ఉదయం నుంచి భక్తుల తాకిడి అధికంగానే కనిపించింది. రద్దీ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి రెండు గంటల సమయం పట్టింది. సాధారణ భక్తులతో పాటు శ్రావణ సుముహూర్తపు వేళ ఒక్కటైన నవ వధూవరులు, వారి కుటుంబీకులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన నవ దంపతులకు రూ. 500 క్యూలైన్‌లోకి ఉచితంగా అనుమతించారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి దర్శనానికి ఇతర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తుల వాహనాలతో ఘాట్‌రోడ్డు నిండిపోగా, ఉదయం 9 గంటల నుంచే కొండపైకి ద్విచక్ర వాహనాలు మినహా ఇతర వాహనాలను అనుమతించలేదు. దీంతో కనకదుర్గనగర్, కెనాల్ రోడ్డు, సీతమ్మ వారి పాదాలతో పాటు హెడ్ వాటర్‌వర్క్స్ వద్ద కార్లు, ఇతర వాహనాలను నిలుపుకుని దేవస్థాన బస్సులో కొండపైకి చేరుకున్నారు. అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేశారు. దీంతో భక్తుల రద్దీ మరింత పెరిగింది. రద్దీతో అమ్మవారి దర్శనంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షించారు. మధ్యాహ్నం మూడు గంటల వరకు భక్తుల రద్దీ కొనసాగింది. సాయంత్రం పంచహారతుల సేవలోనూ ఉభయ దాతలు విశేషంగా పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచుకోవాలి



ఉచిత శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహిళలు ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచుకోవాలని సెంటిని హాస్పిటల్స్ సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ జి.పావని అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల యుజీసీ ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో సెంటిని హాస్పిటల్స్ సౌజన్యంతో మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని ఆ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ పావని మాట్లాడుతూ మహిళలు ఆరోగ్య సమస్యలపై అవగాహన పెంచుకోవటం ద్వారా వాటికి దూరంగా ఉండవచ్చన్నారు. ప్రధానంగా మహిళలకు వివిధ కాలాలు, ఆయా వయస్సుల్లో వచ్చే సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆహారపు అలవాట్లు మారిపోతున్నాయన్నారు. అయితే ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే మంచి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ కళాశాల సిబ్బంది ఆరోగ్యాన్ని గమనంలో ఉంచుకొని తరచుగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రధానంగా శారీరక వ్యాయామంపై అందరూ దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ కె.హరీష్, హాస్పిటల్ జీఎం జి.వెంకటరమణ, స్టడీ సెంటర్ కన్వీనర్ వి.శైలజ, ఐక్యూఏసీ కన్వీనర్ డాక్టర్ జి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

దోమల లార్వా నిర్మూలనకు చర్యలు



బావిలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న బయాలజిస్ట్ సూర్యా నాయక్

పటమట(విజయవాడతూర్పు): నగర పరిశుభ్రతలో భాగంగా పరిసరాల శుభ్రతతో పాటు నగరంలోని పాత బావులను మురుగు కాల్వల నిర్వహణ సక్రమంగా జరిగేందుకు స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని బయాలజిస్ట్ సూర్య నాయక్ అన్నారు. వన్ టౌన్, సత్యనారాయణపురం ఏరియాలో శనివారం ఆయన పర్యటించారు. పాత బావులను గుర్తించి వాటిలో దోమల లార్వా వృద్ధి చెందకుండా మందులు కొట్టి బావులను పైన వస్త్రాలతో కప్పాలని సిబ్బందికి సూచనలు చేశారు. నగరంలో దోమల నివారణకై ప్రతి రోజు హ్యాండ్, లిఠో ఫాగింగ్ యంత్రాల ద్వారా ఫాగింగ్ నిర్వహిస్తూ, నీరు నిల్వున్న ప్రదేశాల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్నామని తెలిపారు. ఇంటి పరిసరాల్లో కొబ్బరి బోండాలు, పూల తొట్లు, పనికిరాని సామగ్రిలో దోమల అవాసాలుగా తయారవుతాయని చెప్పారు. అటువంటి ప్రదేశాలు శుభ్ర పరచుకొని ఏవిధమైన నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని కోరారు. మలేరియా ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

నిరంతర సాధనతో విజయం



విజయవాడ కల్చరల్: నిరంతర సాధన విజయానికి సోపానమని జయహో వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకురాలు కొల్లా జయశ్రీ అన్నారు. జయహో వాకర్స్ క్లబ్, జయహో సర్వీస్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్ క్లబ్‌లో శనివారం తెలుగు సినిమా పాటలపోటీ, విజేతలకు బహుమతి ప్రదానోత్సవ సభను నిర్వహించారు. జయశ్రీ మాట్లాడుతూ గాయనీ గాయకులు శృతి, లయ, రాగ తాళాలపట్ల అవగాహన పెంచుకోవాల్సిన అవసముందని తెలిపారు. సేవా రంగంలో సంస్థ 25 సంవత్సరాలుగా విశేషంగా కృషి చేస్తుందని చెప్పారు. పేద కళాకారులకు ఆర్థిక సహాయం అందిస్తునట్లు తెలిపారు. సీనియర్ గాయని వడ్డాది సూర్యకామేశ్వరి మాట్లాడుతూ మనసును పరవశించేది పాట అని తెలిపారు. భావం చెడకుండా సాధన చేయాలని సూచించారు. విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి బోడి ఆంజనేయరాజు మాట్లాడుతూ జయహో వాకర్స్ క్లబ్ సేవలను అభినందించారు. విజేతలకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు.